పొంచి ఉన్న ప్రమాదం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు, సపోర్టు వైరుతో స్తంభానికి అల్లుకున్న తీగజాతి చెట్టు
- భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు

నడికూడ : మానవ తప్పిదాల వల్ల విద్యుత్ షాక్ నిత్యం ఎక్కడో ఒక్కచోట ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం తోడైతే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండల కేంద్రంలోని గొల్లవాడలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ప్రక్కన ఉన్న విద్యుత్ పోల్‌కు ఉన్న సపోర్టు వైరుతో పాటు స్తంభానికి తీగజాతి చెట్టు అల్లుకుని ప్రమాదాలకు నిలయంగా ఉంది. స్థానికంగా ఉన్న వారి పశువులతో పాటు, చిన్న పిల్లలు గమనించకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అసలే వర్షాకాలం ఏపుగా పెరుగుతున్న తీగజాతి చెట్టు కొమ్మలు అల్లుకున్నాయి. దీంతో వర్షం కురిసినప్పుడు చుట్టుపక్కల ప్రాంతంలో ఎర్త్ వచ్చే ప్రమాదం ఉన్నందున తీగను మేసేందుకు పశువులు పోతే మృతి చెందే ప్రమాదం ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ శాఖ నుంచి ముందస్తుగా తడి వాటికి, విద్యుత్ ఉపకరణాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ ప్రకటన చేస్తారు. కానీ ఆచరణలో మాత్రం శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే తీగజాతి చెట్టను తొలచాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగజాతి చెట్టు



ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగజాతి చెట్టు

తీగ చెట్టును తొలగించాలి



ఇటీవల కురుస్తున్న వర్షాలకు గొల్లవాడకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభానికి తీగజాతి చెట్టు అల్లుకుని ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిస్తున్నాం. – మొర్రి సందీప్, నడికూడ

క్లుప్తంగా

యువత సన్మార్గంలో పయనించాలి : సీఐ

శాయంపేట : యువత సన్మార్గంలో పయనించాలని స్థానిక సీఐ రంజిత్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ముస్పుర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన థాయ్ బస్టర్ షాపును సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిస కాకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పరమేష్, ఏఎస్సై కుమారస్వామి పాల్గొన్నారు.

కొండచిలువ మృతి

నడికూడ : మండల కేంద్రానికి చెందిన రైతు శుక్రవారం తన వ్యవసాయ భూమిని వరి నాట్ల కోసం ట్రాక్టర్‌తో దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్ కిందపడి మృతి చెందింది. ఇటీవల తరుచూ కొండ చిలువలు పొలాల గట్ల పైన, చౌటుపర్తి గుట్టల్లో కనబడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ కోరారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులకు న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా ఇన్‌చార్జ్‌ల పాలనలో చేనేత సహకార సంఘాలు నడుస్తున్నాయని, గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టిన పాపాన పోలేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సంఘాల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు.

ప్రతీ ఒక్కరు అమ్మ పేరుతో మొక్క నాటాలి



మొక్కను నాటుతున్న అధికారులు

వేలేరు : ప్రతీ ఒక్కరు అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎస్సై సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పాఠశాలల్లోనూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌళి, ఎంపీఓ భాస్కర్, హెచ్‌ఎం జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని మండల్ స్పెషల్ ఆఫీసర్ బక్కి నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నడికూడ, ముస్త్యాలపల్లి, చౌటుపర్తి ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలంటే ప్రతీ ఇంటికి కనీసం ఆరు మొక్కలైన నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విమల, ఏపీఓ విద్యావతి, ఎంఈఓ హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన నాయకుడిపై చర్య తీసుకోవాలి

వేలేరు : మహిళలు అని చూడకుండా తనపై, తన కూతురిపై దాడి చేసిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సలీంమాలిక్‌పై చర్య తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బత్తుల జ్యోతి పోలీసులను డిమాండ్ చేసింది. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమకు వారసత్వంగా వచ్చిన ఇంటిస్థలంలో కొంతమంది వ్యక్తులు గోడ నిర్మాణం చేస్తున్నారని తెలిసి నేను అక్కడికి వెళ్లగా ఆ స్థలానికి ఎలాంటి సంబంధం లేని అధికార కాంగ్రెస్ నాయకుడు సలీంమాలిక్ అక్కడికి వచ్చి ఈస్థలం తమదేనని దౌర్జన్యం చేస్తూ పోలీసుల సమక్షంలోనే తమను కొట్టాడని ఆవేదన వ్యక్తం చేసింద. అధికార పార్టీ అండదండలతో రౌడీయిజం చేస్తూ తమను బెదిరిస్తున్నారన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

దామెర : బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం నేడు (శనివారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ శివారులోని జీఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని అన్నారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. మండల, గ్రామాల అనుంధ సంఘాల సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఏకం కావాలి

- ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ సదయ్య

కమలాపూర్ : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులంతా సంఘాల కతీతంగా ఏకం కావాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య అన్నారు. ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, డీఏ, పదవీ విరమణ పొందిన వారికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యలు పరిష్కరించకుడా తా త్సారం చేస్తోందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, హెల్త్‌కార్డుల అమలు కోసం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమునూరి రాంబాబు, మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి వీరబ్రహ్మంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సదయ్య

ఆన్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాంధన్

ధర్మసాగర్ : మండలంలోని అన్ని పాఠశాలల్లో అన్ని రకాల ఆన్ లైన్ పనులు సత్వరమే పూర్తి చేయాలని ఎంఈఓ డాక్టర్ రాంధన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, టీచింగ్ లెర్నింగ్ సెంటర్‌లో ఎంఈఓ అధ్యక్షతన శుక్రవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై 45 రోజులు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని విద్యా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, బేస్‌లైన్ పరీక్షలు, ఫేషియల్ అటెండెన్స్, పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన స్కీం ఇతర విద్యా సంబంధ అంశాలపై సమగ్ర సమీక్ష చేశారు. అలాగే వివిధ పాఠశాలల్లో పూర్తికాని ఆన్‌లైన్ పనులు సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మప్రకాశ్, శ్రీని వాస రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నాగేశ్వరి, హెచ్‌ఎంలు, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 38 మంది విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మోదీ గిఫ్ట్ అనే క్యాక్రమంలో భాగంగా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు కావడానికి ఇబ్బంది పడకుండా ఉండటానికి బండి సంజయ్ ఆలోచనల మేరకు సైకిళ్లు పంపిణీ చేశామన్నారు.పరీక్షల్లో త్తమ ఫలితాలు సాధించి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని, ప్రధాని మోదీని ఆదర్శంగా తీసుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారి సుధాకర్, రాజాప్రతాప్, తూర్పాటి భాస్కర్, సుందరయ్య, శంకర్, శ్రీనివాస్, రాజు, సుధాకర్, లింగయ్య, భిక్షపతి, అంజయ్య, బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని, ప్రభుత్వం ప్రభుత్వ వి ద్యారంగాన్ని పూర్తి నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తుందని దుయ్యపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బీరెడ్డి జస్వంత్, సమీర్, భరత్, గణేష్, రాజ్‌కుమార్, అజయ్, సందీప్, ప్రతిమ, ప్రవళిక, అంజలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

బీఆర్ఎస్వీ కళాశాల కమిటీ ఎన్నిక

శాయంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ఆధ్వర్యంలో బీఆర్ఎస్వీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భోగి అభిలాష్, ప్రధాన కార్యదర్శిగా బండారి సిద్ధు, గౌరవ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సాయిరాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డి ఓమేష్, కార్యదర్శిగా రాయిశెట్టి శివకుమార్, మహిళా అధ్యక్షురాలిగా ఎండీ.సానియా, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే. సానియా, ఉపాధ్యక్షురాలిగా దార హారిక, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తుందని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న శివ

పలువురిపై కేసు నమోదు

వేలేరు : భూ తగాదాల నేపథ్యంలో రెండెకరాల్లో వేసిన పత్తి మొలకలను పీకేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మత రవి, మతం శ్రీశైలం అన్నదమ్ములు. వీరి మధ్య కొంతకాలంగా భూమి పంపకాల విషయంలో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. కాగా రవి తన తమ్ముడైన శ్రీశైలం వాటాకు వచ్చిన రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. శ్రీశైలం సాగుచేసిన పత్తి మొలకల్ని రవి, ఆయన కుమారుడు మల్లికార్జున్ పీకేయడంతో శ్రీశైలం కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి స్థలం వివాదంలో ఒకరిపై...

ఇంటిస్థలం వివాదంలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. వేలేరుకు చెందిన మహ్మద్ పర్వీన్ తన ఇంటిస్థలంలో గోడ నిర్మించుకుంటుండగా అదే గ్రామానికి చెందిన బత్తుల జ్యోతి వచ్చి ఇట్టి స్థలం తనదని గోడ నిర్మాణానికి అడ్డుపడుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై..

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వేలేరుకు చెందిన బత్తుల జ్యోతి తన భూమిలో వేరే వాళ్లు అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని అడ్డుకోవడానికి వెళ్లిన మహిళపై సలీం దాడిచేసి అకారణంగా తనను కొట్టాడని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



రాములు (ఫైల్)

ఎల్కతుర్తి: మండలంలోని సూరారం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమర యోధుడు పిట్టల రాములు(94) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

- పరకాల ఏడీఏ శ్రీనివాస్

దామెర : మండలంలోని ఊరుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉన్నట్లు పరకాల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఏఓతో కలిసి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని అందరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నానో యూరియాపై అవగాహన

నానో యూరియాతో రైతులకు మేలు చేకూరుతుందని ఏడీఏ అన్నారు. మండలంలోని ఊరుగొండలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందని అన్నారు. పంట పెరుగుదల మెరుగవడంతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అల్లె రాకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ కూడా కంగారు పడవద్దని ఏఓ గంగాజమున అన్నారు. శుక్రవారం ప్రభుత్వం పంపించిన యూరియా బస్తాలను మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంలలో యూరియా బస్తాలను నిల్వ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని, 1000 బస్తాల యూరియా(40 మెట్రిక్ టన్నులు) తెప్పించామని తెలిపారు.

యూరియా బస్తాల కోసం ఎగబడిన రైతులు

యూరియా బస్తాలు 888 వచ్చాయని తెలిసి చుట్టూ ప్రక్కల రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంల వద్ద రైతులు ఒకేసారిగా రైతులు భారీసంఖ్యలో ఎగబడ్డారు. దీంతో పోలీసులు బందోబస్తు నిర్వహించి ఒక్కో రైతుకు రెండు బస్తాలు అందజేశారు. యూరియా బస్తాల కోసం రైతులు అధైర్యపడొద్దని రైతులకు సరిపడా పంపిణీ చేస్తామని ఏఓ గంగాజమున పేర్కొన్నారు.

పరకాల: రైతులకు సకాలంలో యూరియా అందిస్తామని ఏఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, మాదారం సొసైటీ సంఘం గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రైవేట్ డీలర్ గానీ, సొసైటీ ద్వారా గానీ యూరియాను బ్లాక్‌లో అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు సొసైటీల్లో 40 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు.



దామెర : ఊరుగొండలో నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు




శాయంపేట: యూరియా బస్తాలను నిల్వ చేయిస్తున్న ఏఓ గంగాజమున



పరకాల : యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బలవంతు లసదయ్య కుటుంబాన్ని శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్‌కుమార్ పరామర్శించి కు టుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రె డ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీరామ్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రవి, మండల ప్రధాన కార్యదర్శి బయ్యపైడి , శివప్రసాద్, శంకర్, తదతరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

- రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వేలేరు : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామం నుంచి నారాయణగిరి వరకు రూ.4 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్ రాథోడ్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఈస్ట్‌జోన్ డీసీపీ



పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తున్న డీసీపీ అంకిత్ కుమార్

ఐనవోలు : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి నేరాల గురించి ఆరా తీశారు. సంబంధిత నేరాల గురించి పలు సూచనలు తెలియజేశారు. ఫిర్యాదులను స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఆయన వెంట మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేష్, పర్వతగిరి సీఐ బీ.రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్ : స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కడియం శ్రీహరి రూ.200 కోట్లకు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడు పోయాడన్నారు. ఆయనకి ఇక మళ్లీ గెలవను అని తెలిసే దోచుకోవడంపై, భూ కబ్జాలపై పడ్డాడని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తల భిక్షతో కడియం శ్రీహరికి ఎమ్మెల్యే పదవి దక్కిందని, మోసం చేసిన కడియం శ్రీహరికి తగిన సమయంలో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ 18 నెలలుగా రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు చేసింది శూన్యం, బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన పథకాలను అమలు చేయడంలో కూడా విఫలం అయిం దన్నారు. అక్కడ రేవంత్ రెడ్డి, ఇక్కడ కడియం శ్రీహరి దోచుకుంటున్నారని, పక్కనే ఉన్న దేవునూరులో సుమారు 20 ఎకరాల భూమి బినామీల పేరు మీద ఉందని, తనకు ఒక్క గుంట భూమి లేదని అబద్ధం చెపుతున్నాడని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్ పా ర్టీకే ఉందన్నారు. పదేళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని, ధర్మసాగర్ మండలాన్ని అన్ని రకా లుగా అభివృద్ధి చేసుకున్నామని, రేపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు మనం చేసిన పనులు చెప్పుకుంటు, కాంగ్రెస్ వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిసేలా చేయాలని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ కర్ర సోమిరెడ్డి, సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, మునిగెల రాజు, కుమార్, సోంపల్లి కరుణాకర్, రాజిరెడ్డి, కుమార్, శ్రీను, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కక్కిరాలపల్లిలో పశువైద్య శిబిరం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ పరిధిలోని వర్ధన్నపేట, రాయపర్తి, ఐనవోలు మండలాలు ఉండగా నేడు ఐనవోలు మండలంలోని కక్కిరాలపల్లిలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో ఎంవీఓ డాక్టర్ శరత్ కుమార్, వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఎండీ.మహమూద్, బండి సంపత్, కర్ర మాలతిరెడ్డి, కొమురయ్య, దామోదర్, మార్కెట్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరాజు, సభ్యులు ఖాజామియా, తదితరులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య